# నేరాలను అరికట్టడానికి 'కార్డన్ సెర్చ్'



అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఏసీపీ బాలగంగి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సంతోషం

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 7 : శాంతి భద్రతలను కాపాడటంతో పాటు నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టడానికి కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దోహదం చేస్తుందని సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ చిన్న బాలగంగిరెడ్డి అన్నారు. శనివారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ సంతోషం ఆధ్వర్యంలో సీబీఎస్, గౌలిగూడ, శివాజీ వంతెన ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఈ సెర్చ్‌లో ఇద్దరు ఏసీపీలు, 8 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు19 , ఏఎస్ఐలు 9, హెడ్ కానిస్టేబుల్ 12, పీసీలు 84, మహిళా కానిస్టేబుళ్లు 22 మందితో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 10 ప్రాంతాల్లో ముగ్గురు అనుమానితులు, ఒక రౌడీ షీటర్, ధ్రువీకరణ పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని తదనంతర పత్రాలు చూపించిన వారికి వారి వాహనాలను అందజేశారు. పుత్లీబౌలి ఓటీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన హారూన్‌ఖాన్ వద్ద రూ.1,17,470 నగదు లభించగా, సరైన పత్రాలు చూపించడంతో నగదును తిరిగి ఇచ్చారు. అక్రమంలో మద్యాన్ని విక్రయిస్తున్న ఉస్మాన్‌గంజ్ రిసాలాఅబ్దుల్లాకు చెందిన రవి గౌడ్‌ను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఏసీపీ బాలగంగిరెడ్డి మాట్లాడుతూ.. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, అదనపు డీసీపీ కె.పృథ్వీధర్‌రావు సూచనల మేరకు ఆపరేషన్‌ను నిర్వహించామన్నారు.

# రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం



రాష్ట్రపతి అవార్డు అందుకున్న గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మనోజ్ ఖన్నాను పలువురు సన్మానించారు. బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, మహిళా అధ్యక్షురాలు రజని, ఉపాధ్యక్షులు శ్రీనివాస గుప్తా, ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా, నగర అధ్యక్షుడు ఎం.మనోజ్, అభినయ్ తివారి, జగదీశ్ గౌడ్, అజయ్ నాయుడు, రఘు వరణ్, అరుణ్‌సింగ్ సన్మానించారు. **- అబిడ్స్, అక్టోబర్ 7**

# 15 నుంచి రామాయణ్ మేళా



కవి సమ్మేళన్ సభలో మాట్లాడుతున్న రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి

అబిడ్స్, అక్టోబర్ 7 : దేవీ నవరాత్రోత్సవాలలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని శంకర్‌జీ మెమోరియల్ హై స్కూల్ ప్రాంగణంలో 15 నుంచి రామాయణ్ మేళా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి పేర్కొన్నారు. రాజస్థాని ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రామాయణ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా కవి సమ్మేళనం, బాల సంస్కార శిబిరం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 న ఉత్సవాలను ప్రారంభించి కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. కవి సమ్మేళనం కార్యక్రమంలో నగరంలో పలువురు ప్రముఖ కవులు పాల్గొని తమ కవితలను వినిపిస్తారని వివరించారు. కార్యక్రమంలో గిరిదారిలాల్ డాగ, మనోజ్ కుమార్ జైస్వాల్, సుమిత్ రాఠి, నందగోపాల్ భట్టడ్ పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరల పంపిణీ

సైదాబాద్, అక్టోబర్ 7 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం కార్పొరేటర్ జంగం శ్వేత బతుకమ్మ చీరలను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సెక్రటరీ చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.



ధూల్‌పేట్‌లో దుర్గామాత విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు





విక్రయానికి సిద్ధంగా అమ్మవారి విగ్రహాలు

# అమ్మవారి విగ్రహాల విక్రయాలు ప్రారంభం

అబిడ్స్, అక్టోబర్ 7 : దేవీ నవరాత్రోత్సవాలలో భాగంగా అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి దుర్గా మాత విగ్రహాలను నెల కొల్పి పూజలు జరుపుతారు. దీంతో ధూల్‌పేట్ ప్రాంతంలో కళాకారులు దుర్గా మాత విగ్రహాలను తయారు చేసి విక్రయాలు చేపడతారు. తయారైన అమ్మవారి విగ్రహాల విక్రయాలు ప్రారంభమయ్యాయి. కళాకారులు తయారు చేసిన అమ్మవారి విగ్రహాలను అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అమ్మవారి విగ్రహాలను దిగుమతి చేసుకుని విక్రయాలు చేపడుతున్నారు. ధూల్‌పేట్, గంగాబౌలి, శివలాల్‌నగర్ ప్రాంతాల్లో అమ్మ వారి విగ్రహాల తయారీ కొనసాగుతోంది.

# సీవరేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



అధికారులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, అక్టోబర్ 7 : గోషామహల్ నియోజకవర్గం మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శివ మందిర్, బడా బంగ్లా, శివలాల్ నగర్ ప్రాంతాల్లో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్, డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ రమేశ్, బీఆర్ఎస్ యువత నాయకులు బల్‌దీప్‌సింగ్‌లతో కలిసి పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను పరిశీలించారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. స్థానికులు సమస్యలపై ఫిర్యాదు చేశారన్నాని, ఆ మేరకు సమస్యల పరిష్కారానికి గాను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి బస్తీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి. శ్రీనివాస్ యాదవ్, నరేశ్‌గౌడ్, సుభాష్ సింగ్, తుల్జారాం సింగ్, అర్జున సింగ్, ప్రకాశ్ సింగ్, నర్సింగ్ సింగ్ పాల్గొన్నారు.



భరత నాట్య కళాకారిణి కళాకృతి నాట్యాలయ వ్యవస్థాపక సంచాలకురాలు భారతీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం దశమ వార్షికోత్సవం రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ , కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రఖ్యాత ఆంధ్రనాట్య నిపుణులు కళాకృష్ణ,పలువురు నృత్యోత్సవాల సంచాకులు సాయివెంకటేశ్,(కర్నాటక), బత్తిన రంగ విక్రమ్‌కుమార్ విచ్చేశారు. **- రవీంద్రభారతి,అక్టోబర్ 7**

# 9న జువైనల్ పెట్రోల్ పంప్ ప్రారంభం

సైదాబాద్, అక్టోబర్ 7 : బాలుర స్పెషల్ హోం (జువైనల్ – గాజుల రామారాం) ఆవరణలో రెండు కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ఔట్ లెట్‌ను సోమవారం ఉదయం రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారని జువైనల్ కరెక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా బేగ్ తెలిపారు. శనివారం సైదాబాద్‌లోని జువైనల్ కరెక్షనల్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గాజుల రామారాంలోని జువైనల్ స్పెషల్ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు జువైనల్ డిపార్ట్‌మెంట్ ఉమ్మడి భాగస్వామ్యంతో పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేశారు.సత్ప్రవర్తన కలిగి శిక్ష పూర్తిచేసి విడుదలైన బాలురకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పెట్రోల్ పంప్‌లను ఏర్పాటు చేస్తుంది. గాజుల రామారాంలోని ప్రత్యేక బాలుర సదనంలో పెట్రోల్ పంప్ నిర్మించటానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ముందుకు రావటంతో ఏర్పాటు చేశారు.

## 20 మందికి అవకాశం ..

పెట్రోల్ పంప్ ఏర్పాటుతో జువైనల్ డిపార్ట్‌మెంట్‌కు నెలకు లక్ష రూపాయల ఆదాయం, స్థలానికి అద్దె వస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు జీతం కాకుండా ఇక్కడే వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. 20 మందికి అవకాశం కల్పిస్తున్నామని, ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పెట్రోల్ పంప్‌లు, అబ్జర్వేషన్ హోంలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని తెలిపారు. సోమవారం ఉదయం పెట్రోల్ పంప్ ఔట్ లెట్‌ను రాష్ట్ర మంత్రులు మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, కె. జనార్దన్ రెడ్డి, సురభి వాణీదేవి, కె. నవీన్‌కుమార్, జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ కమిషనర్ భారతి హోళికేరి, దుండిగల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ, వైస్ చైర్మన్ పద్మారావు, కలెక్టర్ అమోయ్ కుమార్, బాలుర స్పెషల్ సూపరింటెండెంట్ సంగమేశ్వర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.




గాజుల రామారాంలో జువైనల్ స్పెషల్ హోం ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్